సాక్షి
కాకినాడ

శనివారం । 23 । నవంబర్ । 2024



ఒడ్డున వడిదొడుకులు

అంతుచిక్కని భౌగోళిక మార్పులతో తరచూ అంతర్వేది వద్ద సముద్రం.. తీరం వైపునకు పోటెత్తుతున్న తీరుకు ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.


8లో



'మంత్రికి, ఆయన తండ్రికి రుణపడి ఉంటా'

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రామచంద్రపురం సీఐ కడియాల అశోక్‌కుమార్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 600, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున శుక్రవారం నీటిని విడుదల చేశారు. సముద్రంలోకి 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించేలా ప్రధానోపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. జిల్లా పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యాన కాకినాడ జేఎన్‌టీయూ అలుమ్ని ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన ఎంఈఓలు, హెచ్‌ఎంల సమీక్షలో ఆయన మాట్లాడారు. చిన్న పిల్లలు లైంగిక వేధింపులకు గురి కాకుండా ఉండేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మత్తు పదార్థాలు వ్యసనాల బారిన పడకుండా విద్యార్థులను ఉపాధ్యాయులు రోజూ నిశిత పరిశీలన, సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు నూరు శాతం నమోదయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో 49 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. విజ్ఞాన శాస్త్రాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేలా ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. ఈ ల్యాబ్‌ల సక్రమ నిర్వహణకు ఉపాధ్యాయులకు ఆరు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తామని చెప్పారు. జిల్లాలో అపార్ నమోదు వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే నెల 7న అన్ని పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి కలెక్టర్, డీఈఓ పి.రమేష్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

పింఛన్ల పంపిణీ విధానంలో మార్పులు

కాకినాడ సిటీ: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ విధానంలో ప్రభుత్వం మార్పులు చేసిందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి శుక్రవారం విలేకర్లకు తెలిపారు. నూతన విధానం ప్రకారం ఏదైనా కారణంతో పింఛనుదారు ఒక నెలలో పింఛను తీసుకోకపోతే, రెండో నెలలో మొదటి నెల బకాయితో కలిపి చెల్లిస్తారన్నారు. రెండో నెలలో కూడా తీసుకోకపోతే మూడో నెలలో మొదటి రెండు నెలల బకాయితో పాటు చెల్లిస్తారని తెలిపారు. వరుసగా మూడు నెలల పాటు తీసుకోకపోతే ఆ పింఛనును రద్దు చేస్తామని వివరించారు. అలా రద్దయిన పింఛను పునరుద్ధరణకు లబ్ధిదారు సంబంధిత సచివాలయం, ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్‌కు తమ పింఛను ఆపివేసిన తేదీ నుంచి మూడు నెలలల్లోగా అభ్యర్థన సమర్పించాలన్నారు. పునరుద్ధరించిన లబ్ధిదారులకు ఎటువంటి బకాయిలూ చెల్లించబోరని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే, పింఛను పొందుతున్న పురుష లబ్ధిదారు ఈ నెల 1వ తేదీ తరువాత మరణిస్తే వారి జీవిత భాగస్వామికి డిసెంబర్ 1 నుంచి వితంతు పింఛను మంజూరుకు పరిశీలిస్తారని తెలిపారు. ప్రతి నెలా 15వ తేదీ లోగా మంజూరైన వారికి మరుసటి నెల నుంచి పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

ముందు దగా.. వెనుక దగా

- వలంటీర్లను వంచించిన కూటమి సర్కార్
- ఎన్నికల ముందు వారి వేతనం రూ.10 వేలు చేస్తామని హామీ
- ఇప్పుడు ఏకంగా వారి ఉద్యోగాలకే ఎసరు
- జిల్లాలో 12 వేలకు పైగా కుటుంబాలకు క్షోభ
- కూటమి నేతల మోసంపై వలంటీర్ల మండిపాటు

'వెనుక దగా.. ముందు దగా.. కుడి ఎడమల దగా దగా..' అంటూ మహాకవి శ్రీశ్రీ పీడిత జనం కోసం ఏనాడో ఆక్రోశించాడు. ఆ మాటలు ఇప్పటికీ నిజమేనని కూటమి ప్రభుత్వం మరోసారి నిరూపిస్తోంది. ప్రజా సేవకులుగా మన్ననలు అందుకున్న వలంటీర్లకు.. ఎన్నికల ముందు లేనిపోని ఆశలు పెట్టి నమ్మించింది. ఓట్ల అవసరం తీరిన తర్వాత ఇప్పుడు వారి అవసరమేమీ లేదని వంచిస్తోంది. దీనిపై వలంటీర్లతో పాటు ప్రజలు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చంద్రబాబుకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలతో కాకినాడ కలెక్టరేట్ వద్ద వలంటీర్ల ధర్నా

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి నేతలు చెప్పిన మాటలకు.. గద్దెనెక్కాక చేస్తున్న పనులకు అసలు పొంతన లేకుండా ఉంది. నాడు ఓట్ల కోసం తమను నమ్మించి, ఇప్పుడు దగా చేస్తున్నారని దాదాపు అన్ని వర్గాల నుంచీ ఆగ్రహం పెల్లుబుకుతోంది. సూపర్-6 హామీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు తమను నమ్మించి, ఓట్లు వేయించుకున్నాక ఇప్పుడు ముంచేస్తున్నారంటూ రోడ్డెక్కుతున్నారు. ఆశా కార్యకర్తలు, 108 సిబ్బంది, డ్వాక్రా యానిమేటర్లు, ఉపాధి హామీ పథకం చిరుద్యోగులు, వివిధ శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇప్పటికే కూటమి సర్కార్ వంచనపై ఆందోళన బాటలో పయనిస్తున్నారు. ఇచ్చిన హామీల అమలు కోసం ఆయా వర్గాలు ప్రతి రోజూ కలెక్టరేట్‌ను ధర్నాలతో హోరెత్తిస్తున్నారు.

జిల్లాలో వలంటీర్ల వివరాలు

గ్రామ సచివాలయాలు	445
వలంటీర్లు	9,015
వార్డు సచివాలయాలు	175
వలంటీర్లు	3,257
మొత్తం వలంటీర్లు	12,272

వారికి ఇప్పుడు గ్రామ/వార్డు వలంటీర్లు కూడా తోడయ్యారు. కూటమి ప్రభుత్వం నమ్మించి తమ గొంతు కోసిందంటూ శుక్రవారం వారు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.

నాడు చిరునవ్వుతో సేవలు

- దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రారంభించింది. దీని ద్వారా కులం, మతం, రాజకీయం వంటి వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందేవి. తద్వారా ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన బాధ తప్పింది.
- ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారకుండానే జిల్లాలోని 2,79,805 మంది సామాజిక భద్రత పింఛనుదార్ల ఇళ్ల తలుపులు తట్టి.. వలంటీర్లు చిరునవ్వుతో ఠంచనుగా పింఛన్లు అందించేవారు.
- దీంతో పాటు రేషన్ కార్డు, గృహ నిర్మాణానికి దరఖాస్తు చేయాలన్నా, ఓటు నమోదు చేయాలన్నా, కుల, ఆదాయ, ఇతర ఏ సర్టిఫికెట్ కావాలన్నా, ఊళ్లో వీధి దీపాలు వెలగడం లేదన్నా, మంచినీటి కుళాయిలు రావడం లేదన్నా, రేషన్ సక్రమంగా అందడం లేదన్నా.. ఇలా ప్రభుత్వ కార్యక్రమాలపై ఏ సమాచారం కావాలన్నా వలంటీర్లు క్షణాల్లో ప్రజల ముందుండేవారు.
- తమ సేవలతో రాజకీయాలు, వర్గాలకు అతీతంగా ప్రజల మన్ననలు అందుకున్నారు.
- ఇవన్నీ ఒక ఎత్తయితే కోవిడ్ సమయంలో బాధితులను పలకరించేందుకు రక్తసంబంధీకులు కూడా దరి చేరని దుర్భర పరిస్థితి. అటువంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు తమ ప్రాణాలకు సైతం తెగించి మరీ కరోనా బాధితులకు ఆస్పత్రులు, ఇళ్ల వద్ద అందించిన సేవలకు వెలకట్టలేం.

విషం చిమ్మి.. నమ్మించి.. నేడు వంచించి..

సార్వత్రిక ఎన్నికల ముందు వరకూ 'జగనన్న సైన్యం' అంటూ వలంటీర్ వ్యవస్థపై కూటమి నేతలు విషం చిమ్మారు. 'అదేం ఉద్యోగం? మూటలు మోసేది కూడా ఓ ఉద్యోగమేనా?' అంటూ స్వయంగా చంద్రబాబే వెటకారం చేసేవారు. వలంటీర్ వ్యవస్థతో రాష్ట్రంలో 30 వేల మందికి పైగా అమ్మాయిలు అదృశ్యమైపోయారంటూ పవన్ కల్యాణ్ తప్పుడు ఆరోపణలు చేసేవారు. అయితే, ఎన్నికలు సమీపించేకొద్దీ వారు స్వరం మార్చారు. వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని నమ్మించారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఆ హామీ అమలు చేసి, తమను తిరిగి విధుల్లోకి తీసుకుంటుందని వలంటీర్లు ఎదురు చూశారు. తీరా గద్దెనెక్కాక చంద్రబాబు, కూటమి నేతలు ప్లేటు ఫిరాయించేశారు. అసెంబ్లీ సాక్షిగా సంబంధిత మంత్రి అసలు వలంటీరు వ్యవస్థే లేదని ప్రకటించి, వారి ఆశలపై నీళ్లు జల్లి మరో మోసానికి ఒడిగట్టారు. గత ఏడాది ఆగస్టులోనే వలంటీర్ వ్యవస్థ రద్దయ్యిందని మంత్రి చెప్పారు. అటువంటప్పుడు ఈ ఏడాది మే నెల వరకూ తమకు జీతాలు ఎలా ఇచ్చారని వలంటీర్లు నిలదీస్తున్నారు. అసలు విధుల్లోనే లేనప్పుడు వలంటీర్లను ఎన్నికల విధులకు దూరం పెట్టాలంటూ ఏవిధంగా కోర్టుకు వెళ్లారని, కోర్టు మాత్రం స్టే ఎలా ఇచ్చిందని వారు ప్రశ్నిస్తున్నారు. తమను నయవంచన చేసిన చంద్రబాబు అండ్ కోకు బుద్ధి వచ్చే వరకూ ఉద్యమిస్తామని వలంటీర్లు హెచ్చరిస్తున్నారు.



బయోమెట్రిక్ వేయించుకుని వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (పాత చిత్రం)

మంత్రి ప్రకటన హాస్యాస్పదం



ఎన్నికల సమయంలో అడగకుండానే వలంటీర్లకు రూ.10 వేల జీతం ఇస్తామన్నారు. 'నన్ను నమ్మండి' అంటూ చంద్రబాబు, కూటమి నాయకులు వలంటీర్లకు పదేపదే చెప్పారు. ఇప్పుడు వలంటీర్ వ్యవస్థ 2023లోనే రద్దయిపోయిందని మంత్రి చెప్పడం చాలా హాస్యాస్పదంగా ఉంది. 2023లోనే ఈ వ్యవస్థ రద్దయితే ఈ ఏడాది మే నెల వరకూ మాకు జీతాలు ఎలా ఇచ్చారు? ఈ వ్యవస్థ రద్దయితే హైకోర్టుకు వెళ్లి ఎన్నికల విధుల్లో వలంటీర్లు ఉండకూడదంటూ స్టే ఎలా తెచ్చారు? హైకోర్టు ఎలా స్టే ఇచ్చింది? ఎన్నికల హామీలు అమలు చేయలేక ప్రజలను, వలంటీర్లను చంద్రబాబు, మంత్రులు మోసం చేస్తున్నారు.

– ఓరుగంటి సూర్య నందీశ్వరుడు, వలంటీర్ల సంఘం జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యుడు

నమ్మించి మోసం చేశారు



అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాకు ఇస్తున్న రూ.5 వేల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని గత ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థే లేదంటూ కూటమి నేతలు ప్రకటనలు చేయడం దారుణం. ఇప్పటికైనా ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలి.

– గొర్ల రాంబాబు, వలంటీర్, రాచపల్లి, ప్రత్తిపాడు రూరల్

గడప వద్ద సేవలు నిలిచిపోయాయి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప వద్దనే ప్రభుత్వ సేవలు అందేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను వినియోగించడంలేదు. దీంతో ప్రభుత్వ పథకాల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. ఇప్పటికైనా వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించాలి.

– పసుపులేటి జీవ, ధర్మవరం, ప్రత్తిపాడు రూరల్

గిరిజన సమస్యల పరిష్కారమే లక్ష్యం



అనుమర్తిలో గిరిజనులతో శంకర్ నాయక్

శంఖవరం: గిరిజన సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని ఆవెల్లి, అనుమర్తి, ఓండ్రేగుల గిరిజన గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. సమస్యలను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. గిరిజనులు గ్రామసభల్లో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీటిని తక్షణం పరిష్కరించాలని అధికారులను శంకర్ నాయక్ ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పోతురాజు, ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ పాల్గొన్నారు.

రత్నగిరిపై ఘనంగా పడిపూజ

- ఆలయ ప్రాంగణంలో ప్రతిధ్వనించిన సత్యదేవుని నామం
- వేలాదిగా తరలివచ్చిన స్వాములు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో సత్య స్వాముల పడిపూజ (సత్యదేవ అనుగ్రహ పూజ) శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రత్నగిరిపై సత్యదేవుని వార్షిక కల్యాణ మండపం వద్ద రాత్రి ఏడు గంటలకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, అడ్డతీగలకు చెందిన పవనగిరి స్వామీజీ జ్యోతి వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణపతి పూజతో పండితులు పడి పూజకు శ్రీకారం చుట్టారు. వేదస్వస్తి పలికారు. సత్యదేవునికి, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, శంకరులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్య స్వాములతో పూజ చేయించారు. స్వామి, అమ్మవార్లకు వేదాశీస్సులు, మంగళహారతితో రాత్రి ఏడు గంటలకు ఈ పూజ వైభవంగా ముగిసింది. సత్య దీక్ష పడిపూజ, దీక్ష విరమణ ఏర్పాట్లు చాలా బాగున్నాయని పవనగిరి స్వామీజీ అన్నారు. వేద పండితులు గొల్లపల్లి గణపతి ఘనపాఠి, యనమండ్ర శర్మ, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు సుధీర్, దత్తుశర్మ, వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు కామేశ్వరశర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు నాగాభట్ల రవిశర్మ, అంగర సతీష్, పాలంకి పట్టాభి తదితరులు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన సత్య స్వాములు 'జై సత్యదేవ' అంటూ భక్తితో చేసిన నామస్మరణ రత్నగిరి అంతటా ప్రతిధ్వనించింది.

నేడు సత్య దీక్షల విరమణ

సత్య దీక్షలు 27, 18, 9 రోజుల పాటు చేసిన స్వాములు సత్యదేవుని జన్మనక్షత్రం మఖ సందర్భంగా శనివారం దీక్ష విరమించనున్నారు. ఈ సందర్భంగా వేలాదిగా స్వాములు రత్నగిరికి రానుండడంతో అధికారులు వార్షిక కల్యాణ మండపం వద్ద దీక్ష విరమణకు ఏర్పాట్లు చేశారు. అక్కడే హోమ గుండం కూడా ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల నుంచి వచ్చిన సుమారు వెయ్యి మంది గిరిజన సత్య స్వాములు శుక్రవారం సాయంత్రం సత్యదేవుని వ్రతాలాచరించారు. వారికి దేవస్థానం ప్రసాదాలు బహూకరించింది.



పడిపూజలో పాల్గొన్న సత్య స్వాములు

నేడు జన్మనక్షత్ర పూజలు

సత్యదేవుని జన్మ నక్షత్రం మఖ సందర్భంగా శనివారం తెల్లవారుజామున స్వామి, అమ్మవారు, శంకరుల మూలవిరాట్టులకు పంచామృతాభిషేకం నిర్వహించనున్నారు. వేకువన ఒంటిగంటకే స్వామివారి ఆలయం తెరచి పూజలు చేస్తారు. స్వామి, అమ్మవార్ల అభిషేకాల అనంతరం ఉదయం 5 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. దీక్ష విరమించిన స్వాములకు మాత్రం తెల్లవారుజామున 3 గంటల నుంచి ప్రత్యేక దర్శనాలు కల్పించనున్నారు.



జ్యోతి వెలిగించి పడిపూజను ప్రారంభిస్తున్న దేవస్థానం చైర్మన్ రోహిత్, పవనగిరి స్వామీజీ

అవినీతి మార్గం!



తిమ్మాపురంలో ఏడీబీ రోడ్డు శ్మశాన వాటిక వద్ద నుంచి రాజీవ్‌గాంధీ కళాశాలకు వెళ్లే మార్గంలో నిర్మించిన సిమెంటు రోడ్డు



రాజీవ్‌గాంధీ కళాశాల వద్ద ఉపాధి నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డు



ఊర చెరువు వద్ద కాంక్రీట్ యంత్రంతో ఇటీవల చేపట్టిన సిమెంటు రోడ్డు పనులు

- కాకినాడ రూరల్‌లో ప్రైవేటు కళాశాలకు సిమెంటు రోడ్డు
- పంచాయతీ తీర్మానం లేకపోయినా నిర్మాణం
- నియోజకవర్గ నేత ఒత్తిడి తెచ్చారని విమర్శలు
- ఉపాధి నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణలు
- అవకతవకలపై కలెక్టర్‌కు బీజేపీ నేత ఫిర్యాదు

కాకినాడ రూరల్: అధికారం చేతిలో ఉంటే ఏం చేసినా చెల్లుతుందని అనుకుంటే పొరపాటే. ఇది ప్రజాస్వామ్యం.. ఎవరో ఒకరు పాలకుల తప్పులను బట్టబయలు చేయడానికి.. వాటికి అడ్డుకట్ట వేయడానికి ముందుకు వస్తూనే ఉంటారు. అటువంటి సంఘటనే ఇది. అధికారం అండతో ఓ నేత నిబంధనలకు విరుద్ధంగా.. ఏకంగా అధికారుల పైనే ఒత్తిడి తెచ్చి.. ఏకంగా ఓ ప్రైవేటు కళాశాలకు ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేయించారని, దీనిపై విచారణ చేయాలని అధికార కూటమిలోని ఓ పార్టీ నేత సాక్షాత్తూ కలెక్టర్‌కే ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది. దీనికి సంబంధించిన వివరాలివీ.. కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో రూ.77.5 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో ఇటీవల 1,244 మీటర్ల పొడవైన సిమెంటు రోడ్డు నిర్మించారు. మూడు పనులుగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఏడీబీ రోడ్డు శ్మశాన వాటిక నుంచి రాజీవ్ గాంధీ కళాశాల వరకూ రూ.21.5 లక్షలు, ఆ కళాశాల ఎంట్రన్స్ నుంచి ఊర చెరువు వరకూ రూ.22.5 లక్షలు, తిమ్మాపురం నుంచి ఊర చెరువు దుర్గమ్మ గుడి వరకూ రూ.33.5 లక్షలతో ఈ రోడ్డు నిర్మించారు. ఈ పనులు జరిగిన తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. జనావాసాలు లేని ఈ మార్గంలో కేవలం ప్రైవేటు కళాశాల యాజమాన్యానికి లబ్ధి చేకూర్చేలా రోడ్డు నిర్మాణం చేపట్టారని, తద్వారా ఉపాధి నిధులు పక్కదారి పట్టాయని అధికార కూటమిలోని బీజేపీ నేత ఒకరు విమర్శిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఈ రోడ్డు నిర్మించాలంటే మొదట గ్రామ పంచాయతీ తీర్మానం చేయాలి. కానీ, అటువంటిదేమీ జరగలేదు. అయినప్పటికీ ఓ నియోజకవర్గ స్థాయి నేత పంతం పట్టి మరీ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ రోడ్డు వేయించారనే ఆరోపణలు వస్తున్నాయి. అది కూడా రెడీమేడ్ కాంక్రీటుతో కాంట్రాక్టర్ రహదారి నిర్మించడం విమర్శలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పనులను ఆగమేఘాల మీద చేపట్టి, పూర్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ సొంత పార్టీ జనసేనకు చెందిన పంతం నానాజీ కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన నియోజకవర్గంలోనే ఉపాధి నిధులు దుర్వినియోగమవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ రోడ్డు నిర్మాణంలో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తిమ్మాపురానికి చెందిన అధికార కూటమిలోని బీజేపీకి చెందిన నాయకుడు కాళ్ళ ధనరాజు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

తీర్మానం చేయలేదు

మా గ్రామంలో ప్రైవేటు కళాశాలకు సిమెంటు రోడ్డు నిర్మించారు. గ్రామ పంచాయతీ తీర్మానం ఇవ్వకపోయినా పనులు చేపట్టారు. ప్రజాధనం దుర్వినియోగానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి.

– బెజవాడ సత్యనారాయణ, సర్పంచ్, తిమ్మాపురం

రోడ్డు నిర్మాణంలో అవకతవకలు

తిమ్మాపురంలో సుమారు రూ.77.5 లక్షల ఉపాధి హామీ నిధులతో సిమెంటు రోడ్డు నిర్మించారు. జనావాసాలు లేకపోయినా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనులకు బయట నుంచి ప్లాంట్ కాంక్రీటు తీసుకువచ్చారు. ప్లాంట్ కాంక్రీట్‌లో 20 ఎంఎం కంకర ఉండదు. దీనివలన రోడ్డు త్వరగా ఛిద్రమయ్యే అవకాశం ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి.

– కాళ్ళ ధనరాజు, బీజేపీ నాయకుడు, తిమ్మాపురం

పోస్టులే లేవు.. భర్తీ చేసేశారు

- జీజీహెచ్‌లో అవినీతి బాగోతం
- పోస్టుకు రూ.5 లక్షల వసూలు!
- నేడు విచారణ నివేదిక

కాకినాడ క్రైం: నోటిఫికేషన్ పడితే ఉద్యోగాల పేరుతో సొమ్ములు దండుకునే సంఘటనలు చూస్తుంటాం. కానీ, లేని ఉద్యోగాలు ఉన్నట్టుగా నమ్మించి, అమ్మేసి సొమ్ము చేసుకున్న ఘనులు కాకినాడ జీజీహెచ్‌లో తిష్ట వేశారు. కలెక్టర్ దృష్టికి వెళ్లిన ఈ అవినీతి బాగోతంపై శనివారానికి విచారణ పూర్తి చేసి, నివేదిక రూపొందించే పనిలో అధికారులున్నారు. ఇప్పటికే నర్సింగ్ పోస్టుల విక్రయాల అవినీతి ఆరోపణల్లో పీకల్లోతు కూరుకుపోయిన జీజీహెచ్‌లోని ఒక అధికారితో పాటు ఒక ఏడీ స్థాయి అధికారి ఈ బాగోతానికి బాధ్యులని ప్రాథమికంగా గుర్తించారు. వైద్య సేవల పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలు, కేడర్ల వారీగా నియామకాలపై వైద్య విద్య సంచాలకుడు (డీఎంఈ) డీఎస్‌వీఎల్ నరసింహం ఇటీవల జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను నివేదిక కోరిన సందర్భంలో ఈ అవినీతి బాగోతాలు వెలుగు చూశాయి.

2008లో ఆర్థిక శాఖ విడుదల చేసిన జీఓ-487 ప్రకారం వివిధ కేడర్లలో 620 పోస్టులు ఖాళీగా ఉండగా, 2016లో మరో 160 స్టాఫ్ నర్సు పోస్టులు మంజూరయ్యాయి. 2018లో మంజూరైన 2 ఓబీజీ (అబ్‌స్ట్రిక్స్ ఇన్ గైనకాలజీ) యూనిట్లలో 11 మంది ఎంఎన్‌ఓలు (ఔట్‌సోర్సింగ్), 12 మంది ఎఫ్ఎన్‌ఓలు (ఔట్‌సోర్సింగ్), 9 మంది హెడ్ నర్సులు, ఆరుగురు మెడికల్ ఆఫీసర్లు, 21 మంది స్టాఫ్ నర్సుల నియామకాలకు ఏర్పాట్లు చేశారు. ఈ నియామకాల అనంతరం మిగులు పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు జీఓలు 62, 63, 140 విడుదల చేసి, మిగులు పోస్టులను అప్పటికే ఖాళీగా ఉన్న పోస్టుల స్థానంలో భర్తీ చేయాలని ఆదేశాలిచ్చారు.

కొత్త పోస్టులు సృష్టించి..

ఆ సమయంలో జీజీహెచ్‌లో చక్రం తిప్పుతున్న ఓ అధికారి మిగులు పోస్టుల భర్తీ చేపట్టకుండా సమాంతరంగా కొత్త పోస్టులు సృష్టించి నియామకాలు చేపట్టారు. ఒక్కో పోస్టుకు రూ.5 లక్షలు వసూలు చేసి 40 పోస్టింగ్‌లు ఇచ్చినట్టు జీజీహెచ్ కోడై కూస్తోంది. ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, డార్క్ రూమ్ అసిస్టెంట్లు, ఎలక్ట్రీషియన్ గ్రేడ్-2, రేడియోగ్రాఫర్లు, ఫార్మసిస్టు పోస్టులను నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టేశారు. ఉదాహరణకు ఫార్మసిస్టు విభాగంలో 17 రెగ్యులర్ పోస్టులున్నాయి. పడకల సంఖ్య ఆధారంగా మరో 10 పోస్టులు మంజూరు చేశారు. అలా 27 పోస్టులుంటే 31 మందికి అక్కడ పోస్టింగ్‌లు ఇచ్చారని ప్రాథమికంగా తేల్చారు.

రోస్టర్ ఊసే లేదు

ఈ నియామకాల్లో రోస్టర్ ఊసే లేదు. వాచ్ రిజిస్టర్ లేదు. కేడర్ స్ట్రెంగ్త్ వివరాల నమోదూ లేదు. ఇవేవీ లేకుండా భర్తీ చేయడంలో కీలకంగా వ్యవహరించిన అధికారిని ఉన్నతాధికారులు విచారించినట్టు తెలిసింది. నియామక ప్రక్రియలో బాధ్యులైన వారి సంతకాలను ఈ అంశంపై పరిశీలన జరుపుతున్న బృందం గుర్తించింది. ఈ వ్యవహారంపై ఈ నెల 17నే కలెక్టర్, డీఎంఈలకు నివేదిక పంపాల్సి ఉన్నా కారణాంతరాలతో జాప్యం జరిగింది.

జీతాల నిలుపుదల

ఇదిలా ఉండగా అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారి భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకూ అక్రమంగా నియమితులైన వారి జీతాలు నిలుపు చేస్తామని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. దీనిపై కలెక్టర్, డీఎంఈలకు సిఫారసు చేస్తామంటున్నారు. నర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారే ఈ ఉద్యోగాల భర్తీలో అవినీతిపై కూడా విచారణను ఎదుర్కోవాల్సి రావడం చర్చనీయాంశంగా మారింది.

ఒడ్డున వడిదొడుకులు

- అంతుచిక్కని భౌగోళిక మార్పులతో అంతర్వేది సాగరం
- తరచూ తీరం వైపునకు పోటెత్తుతున్న కెరటాలు
- 500 ఎకరాల్లో సరుగుడు తోటల కనుమరుగు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు


అంతర్వేది తీరంలో తీవ్ర కోతకు గురైన సరుగుడు తోటలు


సాగర సంగమం వద్ద వంపులు తిరిగి ఉన్న సముద్రం (ఫైల్)

సఖినేటిపల్లి: అంతుచిక్కని భౌగోళిక మార్పులతో తరుచూ అంతర్వేది వద్ద సముద్రం.. తీరం వైపునకు పోటెత్తుతున్న తీరుకు ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా అమావాస్య, పౌర్ణమి, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో పోటెత్తే సముద్రం, సాధారణ రోజుల్లో కూడా తీరం వైపునకు ఉరకలు వేస్తుండడంతో కంటిమీద కునుకు లేకుండా చేస్తోందని వారు చెబుతున్నారు.

రాజోలు దీవిలో...

రాజోలు దీవిలోని కరవాక, కేశనపల్లి, చింతలమోరి, కేశవదాసుపాలెం తదితర ప్రాంతాల్లోని సముద్ర తీరాలకు భిన్నంగా అంతర్వేది వద్ద తీరం వైవిధ్యంగా ఉంటుందని ఇక్కడి ప్రజలు అంటున్నారు. ఇతర ప్రాంతాల్లోని తీరాల్లో ఒక్క ప్రకృతి వైపరీత్యాల్లో మాత్రమే అలజడిగా ఉండే సముద్రం, సాధారణ రోజుల్లో ఎంతో ప్రశాంతంగా ఉంటుందన్నారు. అయితే కేవలం అంతర్వేది వద్ద మాత్రం ప్రకృతి వైపరీత్యాలతో పాటు, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో తీరం వైపునకు కెరటాల ఉధృతి ఉంటోందని వారు చెబుతున్నారు.

వైవిధ్యానికి కారణాలు ఇవే!

రాజోలు దీవిలో ఇతర ప్రాంతాల్లో తీరంలోని పరిస్థితులకు భిన్నంగా అంతర్వేది వద్ద గోచరిస్తుండడానికి స్థానికులు చెబుతున్న కారణాలు..

◆ అంతర్వేది.. గోదావరి, సాగరం సంగమ ప్రదేశం కావడంతో అమావాస్య, పౌర్ణమిలకు పోటెత్తే ఉప్పునీరు సాధారణ రోజుల్లో కూడా ఎగదన్నుతోంది.

◆ రోజూ పోటు సమయంలో సముద్రం నీరు గోదావరి వైపునకు పోటెత్తడం, ఎగువ ప్రాంతాల నుంచి జిల్లాకు చిట్ట చివరనున్న అంతర్వేదికి చేరే గోదావరి నీటి ప్రవాహం తోడవ్వడంతో నీటి మట్టం రెట్టింపు అవుతోంది.

◆ సముద్ర గర్భంలో అప్పటికప్పుడు వచ్చే మార్పులకు సముద్రం నీరు బిగపెట్టడంతో (సంగమం వద్ద గోదావరి నీరు సముద్రంలోకి రానీయకుండా), ఆ సమయంలో గోదావరి ప్రవాహం దిశ మళ్లీ సమీప సరుగుడు తోటలను ముంచెత్తుతోంది.

◆ విపత్తుల సమయాల్లో సంగమంకు పశ్చిమ వైపు బియ్యపుతిప్ప గ్రామం వద్ద ఇసుక మేటలు ఏర్పడతాయి. దీంతో కెరటాల ఉధృతి ప్రభావం సంగమంకు రెండో వైపు అంతర్వేది తీరంపై పడడంతో భూములకు, సరుగుడు తోటలకు సముద్రపు కోత పెద్ద సమస్యగా మారింది.

◆ అంతర్వేది లైట్‌హౌస్ వద్ద తీరం మలుపు తిరిగి ఉండడంతో సంగమంకు పశ్చిమ వైపుకంటే తూర్పువైపునున్న అంతర్వేది వద్ద నీటి ప్రవాహ వేగం తీవ్రంగా ఉండడంతో ఆ ప్రాంతానికి ఉప్పు నీరు చొచ్చుకు వస్తోంది.

◆ 2001, 2008 సంవత్సరాల్లో లైట్‌హౌస్‌కు సమీపంలోని పల్లిపాలెం గ్రామ రక్షణకు నిర్మించిన గ్రోయన్లు, వాటి మధ్య రివిట్‌మెంట్ పూర్తిగా కోత కారణంగా చతికిలబడి పోటునీరు అడ్డుఅదుపూ లేకుండా పల్లపు ప్రాంతాలను ముంచెత్తుతోంది.

◆ గతానికి ఇప్పటికీ సముద్రం సుమారు 500 మీటర్లు ముందుకు చొచ్చుకు రావడంతో తరచూ పోటు సమయంలో సమీప ప్రాంతాల్లో ఉగ్రరూపం చూపిస్తోంది.

◆ గతంలో కొత్తలైట్‌హౌస్ వద్ద నుంచి సరుగుడు తోటలు విస్తారంగా ఉండేవి. సంద్రం కోత కారణంగా కొద్ది సంవత్సరాలుగా సుమారు 500 ఎకరాల్లో సరుగుడు తోటలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి.

రూ.3 కోట్ల అంచనా వ్యయం

బీచ్ వద్ద నుంచి సాగరసంగమం వరకూ తీరం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కాంక్రీట్ వాల్ కమ్ రోడ్ నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు పర్యాటక శాఖ గతంలో పేర్కొంది. అయితే లైట్ హౌస్ వద్ద నుంచి పల్లిపాలెం వరకూ కాంక్రీట్ వాల్ పొడిగింపు నిర్మాణంతో ఈ మొత్తం రూ.3 కోట్లకు చేరింది. దీనిపై పరిశీలిస్తామని కూడా ఆ శాఖ అప్పట్లో వెల్లడించింది.

పశ్చిమం వైపున దిబ్బలు



సాగర సంగమంకు పశ్చిమం వైపున బియ్యపుతిప్ప వద్ద సముద్రం ఇసుక దిబ్బలు వేస్తుండడం, ఆ కారణంగా తూర్పువైపున నీటి ప్రవాహ వేగం పెరగడం వల్ల లైట్‌హౌస్ వద్ద తరచూ నీరు పోటెత్తుతోంది. సముద్రం పోటు నీరుకు గోదావరి నీటి ప్రవాహం తోడవ్వడంతో ఇక్కడ నీటిమట్టం పెరిగిపోతోంది.

– కొల్లాటి నరసింహస్వామి, మాజీ సర్పంచ్, పల్లిపాలెం

పెరిగిన కెరటాల ఉధృతి



లైట్‌హౌస్ వద్ద తీరం ఒంపు తిరిగి ఉండడంతో సముద్రం కెరటాల వడి మరింత పెరిగింది. దీంతో అమావాస్య, పౌర్ణమిలతో పాటు సాధారణ రోజుల్లోనూ సముద్రం పోటెత్తి తీరం వరకూ చేరుతోంది.

– చొప్పల చిట్టిబాబు, మాజీ సర్పంచ్, పల్లిపాలెం

క్లుప్తంగా

కోడ్‌ను వెక్కిరిస్తున్న ఫ్లెక్సీలు


కోటిపల్లి గ్రామంలో తొలగించని రాజకీయ ఫ్లెక్సీలు

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఇంకా అమలులోకి రానట్టే ఉంది! గ్రామం నడిబొడ్డునే ఏర్పాటు చేసిన రాజకీయ నాయకులు ఫ్లెక్సీలే దీనికి నిదర్శనం. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ కార్యదర్శి కె.హర్షవర్థన్ శుక్రవారం కోటిపల్లిలో పర్యటించారు. ఆయన వచ్చి వెళ్లారు కానీ అధికారులు మాత్రం గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మాత్రం తొలగించలేదు. ప్రతి గ్రామంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నేతల ఫ్లెక్సీలను తొలగించిన సంగతి తెలిసిందే. కానీ కోటిపల్లిలో మాత్రం అధికారుల నిర్లక్షమో లేక ప్రజాప్రతినిధుల పట్ల అంకితా భావమో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు.

లిక్కర్ డిపో ఈఎస్‌వో ఆకస్మిక మృతి

అమలాపురం టౌన్: అమలాపురంలోని ఏపీ బేవరీస్ లిమిటెడ్‌కు చెందిన లిక్కర్ డిపోలో ఎక్సైజ్ సూపర్‌వైజరీ ఆఫీసర్ (ఈఎస్‌వో) పి.మహాత్మారాజ్ (60) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. అమలాపురం పట్టణం సమీపంలోని జనుపల్లె రోడ్డులో ఈయన ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఎంతకూ ఆయన బయటకు రాకపోవడం, తరుచూ ఫోన్ మోగుతుండడంతో స్థానికులు అమలాపురం పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఆయన గుండె పోటుతో ఆకస్మికంగా మరణించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతునికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. భార్య రాజమహేంద్రవరంలో ఉంటున్నారు. దీంతో మహాత్మారాజ్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం తరలించారు. లిక్కర్ డిపో అధికారులు ఈ సమాచారాన్ని విజయవాడలోని తమ హెడ్ ఆఫీసుకు సమాచారం అందించారు.

ఎనిమిది మంది బైండోవర్

అల్లవరం: అల్లవరం తహసీల్దార్ కార్యాలయంలో ఎనిమిది మందిపై బైండోవర్ కేసులను శుక్రవారం నమోదు చేశారని ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. వివిధ మద్యం కేసుల్లో ముద్దాయిలైన బోడసకుర్రుకు చెందిన పి.సూర్యప్రకాష్, ఆవాల రవితేజ, గుబ్బల సత్యనారాయణ, అల్లవరానికి చెందిన టి.జానకిరామారావు, ఆర్.ఆదినారాయణమూర్తి, డి.రావులపాలానికి చెందిన ఎ.సూర్యనారాయణ, బెండమూర్లంకకు చెందిన కె.నాగేశ్వరరావు, శిరగట్లపల్లికి చెందిన ఎస్.మీరమ్మలను మండల ఎగ్జికూటివ్ మేజిస్ట్రేట్ నరింహారావు ముందు హాజరుపరచగా వీరికి రూ.లక్ష చొప్పున పూచీకత్తు విధించారని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

పిచ్‌ను పరిశీలించిన డీఈవో


క్రికెట్ పిచ్ తయారీని పరిశీలిస్తున్న డీఈవో బాషా, ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68వ అంతర్ జిల్లాల (రాష్ట్ర స్థాయి) అండర్–14 క్రికెట్ పోటీల వేదిక అయిన అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రూపుదిద్దుకుంటున్న పిచ్‌ను డీఈవో ఎస్‌కే సలీమ్ బాషా శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 28, 29, 30 తేదీల్లో అమలాపురంలో జరగనున్న ఈ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లపై ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులతో డీఈవో బాషా ఆ క్రీడా స్థలంలోనే చర్చించారు. అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానం, బాలయోగి స్టేడియం, కిమ్స్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో మూడు రోజులపాటు ఏకకాలంలో జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు తగిన వసతులపై కూడా వారితో మాట్లాడారు.

ఈ సందర్భంగా జెడ్పీ బాలురు ఉన్నత పాఠశాల ఫిజకల్ డైరెక్టర్లు జి.గోవింద్, తోట రవిలకు క్రికెట్ పిచ్ తయారీపై డీఈవో సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా క్రికెట్ కోచ్ రాయుడు సతీష్ ఆధ్వర్యంలో క్రికెట్ పిచ్ తయారవుతోంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అడబాల విజయ శ్రీనివాస్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యదర్శి బీవీవీఎస్ఎన్ మూర్తి డీఈవో బాషాతో కలిసి క్రికెట్ పిచ్‌ను పరిశీలించారు.

ఎస్సీ ప్రాంతాల్లో నిర్బంధంగా

విద్యుత్ బిల్లుల వసూళ్లు


ఎ.మల్లవరంలో ఎస్సీ గృహవినియోగదారుల విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తున్న దృశ్యం

కట్టకపోతే కరెంట్ కట్

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో గృహ విద్యుత్ బిల్లుల నిర్బంధ వసూలుకు అధికారులు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మండలంలోని ఎ.మల్లవరం, బీబీ పట్నం తదితర గ్రామాల్లో విద్యుత్ అధికారులు ఎస్సీ గృహ విద్యుత్ వినియోగదారులు ఇళ్ల సందర్శించి నిర్బంధంగా వసూళ్ల చేపట్టారు. రూ.ఐదు వేలుకు పైగా విద్యుత్ బిల్లులు ఉన్న గృహవినియోగదారుల నుంచి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ బిల్లుల మొత్తాన్ని ఒకేసారి చెల్లించాలని విద్యుత్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వినియోగదారులు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల ఒక్క రూపాయి కూడా విద్యుత్ బిల్లులు చెల్లించలేదన్నారు. ఒకేసారి ఆ మొత్తాన్ని చెల్లించాలని, లేకుంటే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని అధికారులు హుకుం జారీచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీనాలీ చేసుకుని జీవనం సాగించే తాము అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించాలని వారు వాపోతున్నారు. కనీసం వాయిదాల పద్ధతిలో నెలనెలా చెల్లించే అవకాశం కల్పించాలని కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇలా నిర్దాక్షిణ్యంగా విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తే తామంతా చీకట్లోనే జీవించే పరిస్థితి దాపురిస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

కనెక్షన్లు తొలగించారంటూ నిరసన

తొండంగి: మండలంలోని గోపాలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తొండంగికి చెందిన వినియోగదారులు తమ విద్యుత్ కనెక్షన్లు తొలగించారని శుక్రవారం నిరసన తెలిపారు. బాధితుల వివరాల ప్రకారం తొండంగి ఎస్సీపేటకు చెందిన 20 విద్యుత్ వినియోగదారుల విద్యుత్ కనెక్షన్లను విద్యుత్‌శాఖ అధికారులు తొలగించారు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తొలగించడంపై విద్యుత్‌శాఖ సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సబ్ స్టేషన్ వద్ద వినియోగదారులు నిరసన తెలిపారు. అయితే పాతబకాయిల కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కనెక్షన్లు సిబ్బంది తొలగించారని విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో బకాయిల చెల్లింపునకు 20 రోజుల గడువు ఇవ్వడంతోపాటు విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించేందుకు అంగీకరించారు.

మంత్రికి, ఆయన తండ్రికి రుణపడి ఉంటా

- వనసమారాధనలో రామచంద్రపురం సీఐ వివాదాస్పద వ్యాఖ్యలు
- ఉన్నతాధికారుల సీరియస్
- వీఆర్‌కు పంపిన వైనం


అశోక్ కుమార్, సీఐ


శెట్టిబలిజ వనసమారాధనలో పోలీస్ యూనిఫాంతో ప్రసంగిస్తున్న సీఐ అశోక్ కుమార్

రామచంద్రపురం: స్థానిక సీఐ కడియాల అశోక్‌కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. రామచంద్రపురం పట్టణంలోని టౌను హాలులో గురువారం జరిగిన శెట్టి బలిజ సామాజికవర్గ వనసమారాధనకు ఆయన పోలీసు యూనిఫాంతో వెళ్లడమే కాకుండా.. "నేను ఇక్కడకు (రామచంద్రపురం సీఐగా) రావడానికి సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, ఆయన తండ్రి సత్యానికి నేను, నా కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటాం'' అని బహిరంగంగా చెప్పారు. అంతేకాకుండా "భవిష్యత్ అంతా మనదే. ఎందుకంటే పోలీసు శాఖతో పాటుగా ఇతర శాఖల్లోనూ మనవారున్నారు'' అని అన్నారు. ఆయన మాట్లాడిన వీడియో వైరల్ కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై నియోజకవర్గానికి చెందిన కొంత మంది పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు సీఐ అశోక్‌ను వీఆర్‌కు పంపిస్తూ చర్య తీసుకున్నారు. కోనసీమ జిల్లాలో ప్రస్తుతం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఈ విషయమై కలెక్టర్‌కు నివేదిక కూడా సమర్పించారు.

ఆది నుంచీ వివాదాస్పదమే..

సీఐ అశోక్ కుమార్ వ్యవహార శైలి ఆది నుంచీ వివాదాస్పదంగానే ఉంది. గత ఆగస్ట్ 7న ఆయన రామచంద్రపురం సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచీ అధికార పార్టీకి చెందిన వారిలో ఒక వర్గానికి పూర్తిగా కొమ్ము కాస్తున్నారనే విమర్శలు ఎదుర్కొన్నారు. గతంలో జగనన్న కాలనీల్లో టీడీపీకి చెందిన కొంత మంది ఇసుకను బహిరంగంగానే దొంగిలించుకుపోగా, వారి పక్షాన ఉంటూ కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అనంతరం రామచంద్రపురం మండలం తాళ్లపొలం గ్రామంలో జరిగిన ఒక సివిల్ వివాదంలో తలదూర్చి, టీడీపీ వారికి వత్తాసు పలికి, సివిల్ కేసును మరింత వివాదంగా మార్చారని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. అంతే కాకుండా ప్రతి విషయంలోనూ టీడీపీకి చెందిన ఒక రౌడీషీటర్‌కు మంత్రి సహాయ సహకారాలతో కొమ్ముకాస్తూ, ఆయన చేసిన ఘనకార్యాలకు వత్తాసు పలికారంటూ నియోజకవర్గ వాసులతో పాటు శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన కొంత మంది కూడా వ్యతిరేకించడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

గతంలో రామచంద్రపురం ఎస్సైగా సీఐ అశోక్ కుమార్ బంధువైన పాటి వాసు బాధ్యతలు స్వీకరించారు. తరువాత రామచంద్రపురం సీఐగా అశోక్ ఇక్కడకు వచ్చారు. అనంతరం వారం రోజుల్లోనే ఎస్సై వాసు కూడా వీఆర్‌కు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఆ సందర్భంలో స్థానికంగా ఉన్న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తిరిగి వాసును ఉంచే ప్రయత్నం చేయలేదంటూ అదే పార్టీకి చెందిన వారు అలక వహించినట్లు అప్పట్లోనే గుసగుసలు వినిపించాయి. తాజాగా సీఐ అశోక్‌ను కూడా వీఆర్ నుంచి తప్పించడంలో మంత్రి చేతులెత్తేశారని సమాచారం. ఏరి కోరి తెచ్చుకున్న సీఐ ఇలా వివాదాల్లో ఇరుక్కోవడం మంత్రికి తలనొప్పిగా మారినట్లు టీడీపీ వర్గాలు అంటున్నాయి.

గుడిమెళ్లంకలో శృంగేరి జగద్గురువుల విజయయాత్ర


బ్రోచర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, ధార్మిక సంస్థల ప్రతినిధులు

రేపు శృంగేరి పీఠాధిపతి శ్రీవిదు శేఖర మహాస్వామి గ్రామానికి రాక

అమలాపురం టౌన్: మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామంలో ఈ నెల 24, 25 తేదీల్లో జగద్గురు శృంగేరి పీఠాధిపతి శ్రీవిదు శేఖర మహాస్వామి విజయ యాత్ర జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తెలిపారు. విజయయాత్ర కోసం శృంగేరి పీఠాధిపతి శ్రీవిదు శేఖర మహాస్వామి గుడిమెళ్లంక గ్రామానికి విచ్చేస్తున్నారని పేర్కొన్నారు. అమలాపురం ప్రెస్ క్లబ్ భవనంలో ధార్మిక సంస్థల ప్రతినిధులు మంగళంపల్లి సాయిరామ్, మంగళంపల్లి కార్తీక్ శర్మ, గొవ్వాల నాగరాజుతో కలిసి మాజీ ఎమ్మెల్యే వేమా శుక్రవారం ఈ యాత్రకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గుడిమెళ్లంక గ్రామంలో 25వ తేదీన జరిగే ఉమా లక్ష్మణేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు శంకుస్థాపన సందర్భంగా ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు విజయ యాత్ర, శంకుస్థాపనకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు.

బెల్ట్ షాపుపై ఎక్సైజ్ అధికారుల దాడి

- జనసేన పార్టీ కార్యకర్తపై కేసు నమోదు
- 126 మద్యం, నాలుగు బీరు సీసాలు స్వాధీనం


బెల్ట్‌షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని, మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న ఎస్‌టీఎఫ్, ఎక్సైజ్‌శాఖ అధికారులు

కరప: మండలంలోని పెనుగుదురులో ఒక మద్యం బెల్టు షాపుపై ఎస్‌టీఎఫ్ (స్పెషల్ టాస్క్‌ఫోర్స్), తాళ్లరేవు ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడి చేసి, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 126 మద్యం సీసాలు (180 ఎంఎల్), నాలుగు బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన మేరకు... పెనుగుదురులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు మంగళగిరిలోని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సమాచారం అందింది. అక్కడి అధికారుల ఆదేశాల మేరకు ఎస్‌టీఎఫ్, మంగళగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ సభ్యుల బృందం గురువారం పెనుగుదురులో దాడి చేసింది. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న జనసేన పార్టీ కార్యకర్త పప్పుల ఆదివిష్ణు మల్లేశ్వరరావును అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 126 మద్యం, నాలుగు బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించారు. స్థానిక ఎమ్మెల్యే, నాయకులు జనసేన పార్టీ కార్యకర్తపై కేసు నమోదు చేయకుండా వదిలేయాలని ఎంతగా ఒత్తిడి తీసుకొచ్చినా ఫలించలేదు. కరపలోని జనసేన పార్టీ నాయకులకు చెందిన మద్యం దుకాణం నుంచి మద్యం సీసాలు తీసుకున్నట్టు అధికారులు గుర్తించారు. బెల్ట్ షాపునకు మద్యం సీసాలు అమ్మిన షాపుపై కేసు నమోదు చేస్తారో, అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి వదిలేస్తారోనని గ్రామంలో చర్చించుకుంటున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ బెల్ట్ షాపు నిర్వహిస్తే రూ.5 లక్షలు అపరాధ రుసుం వసూలు చేస్తామని చెప్పారని, అది అమలులో చూపించాలని మహిళలు కోరుతున్నారు. ఈ దాడిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ తాళ్లరేవు సీఐ కె.కోటేశ్వరరావు, ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, ఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పతకమే ధ్యేయంగా ఆడాలి


సపక్ తక్రా జట్టుతో జిల్లా అధ్యక్షుడు తాతబాబు, కార్యదర్శి సాయిదుర్గ ప్రసాద్ తదితరులు

అమలాపురం రూరల్: కర్నూలు జిల్లా నందికొట్కూరులో ఈ నెల 26 నుంచి 27 వరకు 27వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల సపక్ తక్రా చాంపియన్ షిప్ పోటీలు జరుగుతాయని అంబేడ్కర్ కోనసీమ జిల్లా సేపక్ తక్రా క్రీడ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు, కార్యదర్శి కేతా సాయిదుర్గ ప్రసాద్ తెలిపారు. వారం రోజులుగా జిల్లా టీమ్‌కు ఎంపికైన వివిధ ప్రాంతాలకు చెందిన బాల బాలికలకు కోచ్ యాండ్ర గౌతమ్ ఆధ్వర్యంలో అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. శిక్షణ ముగింపు సభ శుక్రవారం నిర్వహించారు. క్రీడాకారులను ఉద్దేశించి తాతబాబు మాట్లాడుతూ పతకమే ధ్యేయంగా ఆడి మంచి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా క్రీడాకారులను వాకర్స్ సభ్యులు డాక్టర్ వై.నరసింహారావు, తొట రాము, కూచిమంచి కృష్ణ, కొమ్ముల సురేష్ అభినందించారు. టీం మేనేజర్ జీవీ బాబు, అసోసియేషన్ సభ్యులు మనగాల మన్యం, సైదుల రమణ ,బుల చిరంజీవి, పీవీ రావు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఆరునెలల జైలు

రూ.3లక్షల నష్ట పరిహారం విధింపు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన వ్యక్తికి ఆరునెలల జైలు, రూ.3 లక్షల పరిహారం విధిసూత్ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ చెందిన జి.హేమంత్ వద్ద నుంచి కాకినాడకే చెందిన డి.వినోద్‌కుమార్ 2021లో రూ. 3 లక్షల అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చేందుకు 2022లో రూ.3 లక్షల చెక్కు ఇచ్చారు. చెక్కును హేమంత్ బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించాడు. కోర్టు విచారణలో వినోద్‌కుమార్ పై నేరం రుజువు కావడంతో ఆరునెలల జై లు, రూ.3 లక్షల పరిహారం విధిస్తూ తీర్పు చెప్పారు.

తేరేగింపు!


కొత్తపేటలో రథాల ఊరేగింపు

కొత్తపేట: ప్రజలను విశేషంగా ఆకర్షిస్తూ రథం వెనుక రథం పయనమవుతున్నాయి. వాటి ముందు కొందరు యువకులు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులకు, గృహస్తులకు రాకపోకలు సాగిస్తున్న వాహనాదారులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఇంతకీ ఆ రథాల యాత్ర ఏమిటనుకుంటున్నారా? కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారి పాలెంలో పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయ చతుర్థ వార్షికోత్సవం ఈ నెల 25న జరగనుంది. ఆలయ నిర్మాణకర్త గొలకోటి మాచరరావు (ఈవెంట్స్ మాధవ్) ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దీన్ని పురస్కరించుకుని కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాలతో పాటు అమలాపురం ప్రాంతాల్లో వృషభ, గజ, అశ్వ, హంస, ఒంటి వాహన రథాల ఊరేగింపుతో ప్రజలను ఆహ్వానిస్తూ చేపట్టిన కార్యక్రమం ఆకట్టుకుంది. దారి పొడవునా ఆ వాహనాలతో అనేకమంది సెల్ఫీలు తీసుకున్నారు.